

# రాగ బంధాలు

-శ్రీమతి ఎ. కమల నరసింహారావు

అప్పటిదాకా కుండపోతగా కురిసిన వర్షం కొంచెం వెలిసినట్లుయింది. ఉండి, ఉండి చల్లటి ఈదురుగాలి రివ్వుమని వీస్తూనే ఉంది. ఆ గాలితో పాటు నాలుగు చినుకులు పడుతూనే ఉన్నాయి. డాబామీద నుంచి బయటకు పెట్టిన నీటిగొట్టాలలో నుంచి ఇంకా వర్షపునీరు శబ్దం చేస్తూ పడుతూనే ఉంది. చూస్తూండగానే నల్లటి మబ్బులు మళ్లీ గూడు కట్టుకొంటున్నాయి.

"ఇక ఈ వేళకి ఈ వాన వెలిసేలా లేదు." హాల్లో కిటికీ ఎదురుగా సోఫా మీద కూర్చుని భుజంమీద నుంచి జారుతున్న శాలువాను మరింత దగ్గరగా కప్పుకుంటూ, గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు పరంధామయ్య.

లోపలి గదిలోనుంచి అప్పుడే హాల్లోకి వచ్చిన పార్వతమ్మ భర్త మాటలు విని, "ఇంకా అయిదైనా కాలేదు. అప్పుడే చీకట్లు ముసురుకొంటున్నాయి. దీనికి తోడు కరెంటుకూడా పోయింది" అంది.

పరంధామయ్య వెనుతిరిగి ఒకసారి భార్య వేపు చూసి, మళ్లీ సోఫాలో సర్దుకు కూర్చున్నాడు.

ఇంతలో పక్క వాటాలో అద్దెకుంటున్న వారి పిల్లలు బిలబిలమంటూ వాకిట్లోకి వచ్చి, అక్కడ మడుగులా ఏర్పడిన నీళ్లలో కాగితపు పడవలు చేసి వదుల్తుతూ బిగ్గరగా కేకలు పెడుతూ నవ్వుకొంటున్నారు.

"ఒరే, అన్నయ్యా! తమ్ముడి పడవ చూడు, అప్పుడే మునిగిపోయింది. నాది చూడు, ఎలా దూసుకు పోతోందో!" ఒక పిల్లవాడు తన పడవ వేపు గర్వంగా చూపిస్తూ అన్నాడు.

"అన్నయ్యా! నాకూ కత్తి పడవ చేసియ్యవూ?" మరో పసిపిల్ల అడుగుతూంది.

పరంధామయ్య లేచి కిటికీ దగ్గరకు వెళ్లి కాంపౌండ్‌లో ఆడుకొంటున్న పిల్లల వేపు చూశాడు. మడుగు కట్టిన నీళ్లలో కొన్ని కాగితపు పడవలు గాలికి అటు ఇటు తిరుగుతున్నాయి. ఒకటి, రెండు తడిసి మునిగిపోయాయి. గాలికి కదులుతున్న పడవల వేపు చూస్తూ పిల్లలు గోలగా అరుస్తున్నారు. అందులో ఒక చిన్న పుల్ల తీసుకొని ఓ పడవకు అటు ఇటు నీళ్లలో గీస్తున్నాడు, తెడ్డు వేస్తున్నట్లుగా.

"వీళ్లెప్పుడు వచ్చారు?" వెనక్కు తిరిగి వచ్చి సోఫాలో కూర్చుంటూ అడిగాడు పరంధామయ్య.

"ఈ వేళ మధ్యాహ్నం వచ్చారు పెద్ద అల్లుడూ, కూతురూ, పిల్లలూను. ఇంకా చిన్న అల్లుడు, కూతురు, పిల్లలు, కొడుకు, కోడలు రాలేదని ఆమె బాధ పడుతోంది." పక్క వాటావాళ్ల గురించి చెప్పింది పార్వతమ్మ.

"చూడండి— పిల్లలు వచ్చేసరికి ఎంత సందడిగా ఉందో, ఎంత కళ వచ్చిందో!" పార్వతమ్మమాటలు వినిపించుకోనట్లుగా, మళ్లీ కిటికీ దగ్గరకు వెళ్లి ఆడుకొంటున్న పిల్లల వేపు చూడసాగాడు పరంధామయ్య.

పార్వతమ్మ మాటలు ఆయనకు శూలాల్లా గుచ్చుకొన్నాయి. అవును. అయినవాళ్లంతా వస్తేనే కళ వస్తుంది. లేకపోతే ఏముంది?

"ఒరేయ్, ఇంకా చినుకులు పడుతూనే ఉన్నా ఏమిట్రా ఆ ఆటలు? రేపు ఏ జలుబో, దగ్గో వస్తే చెయ్యలేక చావాలి. రండి లోపలికి." ఆ పిల్లల తల్లి వరండాలో నిలుచుని కేకలు వేస్తున్నా పిల్లలు ఆటలు మానలేదు. అన్నయ్య కత్తి పడవ చేసి ఇవ్వలేదని పసిపిల్ల ఏడుస్తూంది. ఉన్నట్లుండి ఒక్కసారిగా ఈదురుగాలి వీచింది.

"మీ కసలే ఈ చలిగాలి పడదు. ఎందుకు ఆ కిటికీ దగ్గర నిలుచుంటారు? ఇలా వచ్చి సోఫాలో కూర్చోరాదూ?" పార్వతమ్మ క్రింద కూర్చుని లాంతరు గ్లాసు పాత గుడ్డతో తుడుస్తూ అంది.

పరంధామయ్య కొద్ది క్షణాలు కిటికీ

దగ్గర నిలుచుని పిల్లల ఆటలు చూసిన తరవాత, భారంగా వచ్చి సోఫాలో కూర్చుని ఒక నిట్టూర్పు విడిచాడు.

"చేసుకొన్న వారికి చేసుకొన్నంత అన్నట్లుగా. . . ఒక పండగ లేదు, ఒక పబ్బం లేదు. సంతోషం లేదు. ఎందుకీ మొండి బతుకులు?" తుడిచిన గ్లాసును లాంతరుకు బిగిస్తూ గొణుక్కుంటున్నట్లుగా అంది పార్వతమ్మ.

"ఎవరి ఇల్లు చూసినా పిల్లా పాపలతో, కొడుకులు కోడళ్లతో కళకళలాడుతూ ఉంటుంది. ఏ జన్మలో చేసుకొన్న పాపమో ఈ జన్మలో అనుభవిస్తున్నాం. . ." పార్వతమ్మ గొణుగుడు స్పష్టంగా వినిపిస్తూంది.

"పిల్లలు లేని వాళ్లకు ఒక్కటే బాధ— లేరని. కాని, నాది పిల్లలున్నా గొడ్రాలి బ్రతుకులాగే తయారైంది. ఎంతెంతగా ఆశలు పడ్డానో అన్నీ బూడిదలో పోసిన పన్నీరులా తయారైంది."

బయట పెద్ద శబ్దంతో మళ్లీ వర్షం మొదలయింది. కాగితపు పడవలతో ఆడుకొంటున్న పిల్లలు బిగ్గరగా అరుస్తూ లోపలికి వెళ్లిపోయారు. ఆ గోలలో పార్వతమ్మ మాటలు కలిసిపోయాయి.

పార్వతమ్మ లాంతరు వెలిగించి, హాలు మధ్యలో ఎత్తైన ఒక స్టూలు మీద ఉంచి, సోఫా దగ్గరగా క్రింద చాప వేసుకొని కూర్చుంది. పరంధామయ్య వెలుగుతున్న లాంతరు వేపు, భార్య వేపు ఓ సారి చూసి, మళ్లీ కిటికీలో నుంచి బయటకు చూడసాగాడు. పక్క వాటాలో పిల్లలు దీపావళికి తెచ్చుకొన్న తుపాకులు కాలుస్తున్నారులా ఉంది, శబ్దాలు వినిపిస్తున్నాయి. పక్క వాటాలో పెద్దవాళ్లకూడా ఏదో చెప్పుకొని నవ్వుతున్నారు.

'అవును. అందరూ సంతోషంగా ఉన్నారు. మరి ఈ ఇల్లెందుకు ఇలా భరించలేని నిశ్శబ్దంతో ఉండిపోయింది? ఎక్కడ జరిగింది పొరబాటు? దీనికంతకూ కారణం ఎవరు? తనా?, పరంధామయ్య ఆలోచనలు చిక్కుపడిన దారంలా అయిపోయాయి.

వర్షం జోరు హెచ్చింది. గాలికూడా ఎక్కువైంది. పరంధామయ్య కొద్దిగా దగ్గాడు. కాళ్లూ చేతులూ కప్పుకొని సోఫాలో ముడుచుకు కూర్చున్నాడు.

"అసలే చలిగా ఉంది. లోపలికి వెళ్లి పడుకోకూడదూ? మీ ఆరోగ్యం కూడా సరిగా లేదు."

పరంధామయ్య మాట్లాడలేదు. సోఫాలోనుంచి లేచే ప్రయత్నంకూడా చేయలేదు.

"వేడివేడిగా కాసిని కాఫీ ఇమ్మంటారా?" పార్వతమ్మ లేచి భర్త దగ్గరగా వచ్చి అంది.

"నాకు కాఫీ ఎందుకే!" పరంధామయ్య విరక్తిగా అన్నాడు. పక్క వాటాలో నుంచి రకరకాల శబ్దాలు, నవ్వులు వినిపిస్తున్నాయి.

భర్త మాటలకు ఆమె బాధ పడింది.

"సరే, ఇప్పుడెప్పుడు అనుకుంటే ఏం లాభం? జరిగింది జరిగిపోయింది. మన రాత లిలా ఉన్నప్పుడు ఎవరేం చేస్తారు? మీరు లేని పోనివన్నీ ఆలోచించి హైరానా పడకండి."

కొద్ది నిమిషాల క్రితం అంతగా బాధ పడిన భార్య అంతలోనే తేరుకొని తనకు నచ్చ చెప్పడం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

"నేనే తొందరపడ్డాను, పార్వతీ! అంతా నా మూలంగానే జరిగింది. చూస్తూ సహించలేకపోయాను." పరంధామయ్య బరువుగా అన్నాడు.

వర్షం జోరు ఎక్కువైంది. డాబా మీది నీటిగొట్టాల్లోంచి పెద్ద శబ్దంతో వర్షపునీరు పడుతూంది. స్విచ్ వేసి ఉందేమో కరెంటు వచ్చి, మళ్లీ అంతలోనే పోయిందనడానికి గుర్తుగా హాలులో బల్బు ఒక్కసారి వెలిగి ఆరిపోయింది.

"మీ ఆరోగ్యం అసలే సరిగా లేదు, ఏమీ ఆలోచించకండి. కిటికీ తలుపులు వేయమంటారా?" పార్వతమ్మ భర్త వేపు చూసి అడిగింది.

ఆయన మౌనంగా తల ఊపాడు. ఆమె కిటికీ దగ్గరకు వెళ్లింది, కిటికీ రెక్కలు మూయడానికి సిద్ధమవుతూ, బయటకు చూసి ఒక్కసారిగా ఆగిపోయింది.

"ఎవరో ఆడపిల్ల— చంకలో పిల్లవాడితో తడుస్తూ ఇటుకేసే వస్తూంది. పాపం! చంకలో పిల్లవాడుకూడా ఉన్నాడు."

ఆ మాట అవగానే పార్వతమ్మ గబగబా వీధి గుమ్మం దగ్గరకు వెళ్లి తలుపులు తీసింది.

"ఎవరమ్మా మీరు?" పార్వతమ్మ అడిగింది.

వర్షంలో ఆమె ఏమి జవాబు చెప్పిందో పరంధామయ్యకు వినిపించలేదు.

"ఆ . . . లోపలికి—రా, అమ్మా! అయ్యో! పిల్లవాడు తడిసి ముద్దయి పోయాడు. ఉండు, వస్తాను."

పార్వతమ్మ లోపలికి వెళ్లి రెండు తువ్వాళ్లు తెచ్చి, "ముందు పిల్లాడికి తల తుడు. జలుబు చేస్తుంది" అని వాటిని ఆమెకు అందించింది. ఆమె పార్వతమ్మ వైపు కృతజ్ఞతగా చూసి, తువ్వాళ్లు అందుకొని, హాల్లో ఒక పక్కగా కూర్చుని పిల్లవాడికి తల, ఒళ్లు తుడిచింది. తడిసిపోయిన వాడి చొక్కా తీసేసి, హాల్లో వాడిని కూర్చోబెట్టి, కిటికీ దగ్గరకి వెళ్లి పిల్లవాడి చొక్కాను, తన చీర కుచ్చెళ్లను, కొంగును పిండుకొని, తల తుడుచుకొని, తువ్వాళ్లను పిండి ఆరేస్తూ లోపలికి వచ్చింది.

"మీకు శ్రమ కలిగించినందుకు క్షమించండి. మాకు తెలిసిన వాళ్ల ఇంటికి వెళుతూంటే దారిలో వర్షం పట్టుకొంది. ఎక్కడా ఒక రిక్షాకూడా కనిపించలేదు. అవ్వనిసరిఅయి, మీ వరండాలో తలదాచుకోవడానికి వచ్చాను." భార్యాభర్తలిద్దరినీ మార్చి మార్చి చూస్తూ అంది ఆమె.

"పర్వాలేదమ్మా. . . ఇబ్బందులనేవి ఎవరికైనా వస్తాయి. నీ పేరేమిటి? అబ్బాయికి పాలేమైనా పడతావా?" చివరి మాట అంటున్నప్పుడు పార్వతమ్మ గొంతు కొద్దిగా వణికింది.

కరెంటు వచ్చినందుకు చిహ్నంగా హాలులో లైటు వెలిగింది. ఆ లైటు వెలుగులో ఆ వచ్చినామె మెడలోని రవ్వల నెక్లెస్ జిగేలుమని మెరిసింది.

"నా పేరు సుజాత అండీ! ఇంటి నుంచి బయలుదేరేటప్పుడే వాడు బిస్కట్లు తిని, పాలు తాగాడు. ఇప్పుడేమీ అక్కర్లేదు."

"మీ ఆయన ఎక్కడ పని చేస్తూంటారమ్మా?" మాట్లాడక పోతే బాగుండదని పరంధామయ్య అడిగాడు.

"ఇక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారండీ. హెడ్ఆఫీసునుంచి ఈ ఊళ్లో బ్రాంచ్‌కి ఈమధ్యనేవార్చారు" అని పరంధామయ్యకు సమాధానం చెప్పి, "ఈ తువ్వాళ్లు ఎక్కడ ఆరేయమంటారు?" అని పార్వతమ్మ ముద్దేశించి అడిగింది సుజాత.

"అవి నేను ఆరేస్తాలే, అమ్మా! బాగా తడిసిపోయావు. జలుబు చేస్తుంది. అందులోనూ పసిబిడ్డ తల్లివి. నీవు మరోలా అనుకోకపోతే, లోపలికి వచ్చి చీర మార్చుకో, అమ్మా." పార్వతమ్మ అంది, సుజాత చేతిలోనుంచి తువ్వాళ్లు అందుకుంటూ.

పార్వతమ్మ మాటలకు సుజాత ఆశ్చర్యపోయింది.

"ఎందుకండీ? వర్షం వెలిసేటట్లుగా ఉంది. కొద్ది సేపట్లోనే వెళ్లవచ్చు."

"కాదమ్మా— నా మాట విను. అయినింటి ఆడపడుచులా ఉన్నావు. చాలా సుకుమారంగా ఉన్నావు. జలుబు చేస్తుంది."

పార్వతమ్మ మాటల్లో ఆప్యాయత తొంగి చూస్తూంది.

"ఇది పరాయి ఇల్లులా భావించకు, తల్లీ. లోపలికి వెళ్లు." పరంధామయ్య హాలులో నేలమీద దోగాడుతున్న పిల్లవాడిని ఆప్యాయంగా చూస్తూ సుజాతతో అన్నాడు.

"మిమ్మల్ని చూస్తే మా అమ్మ గుర్తుకొస్తున్నదండీ" అంటూ సుజాత తన దగ్గరికి దోగాడుతూ వచ్చిన పిల్లవాడిని ఎత్తుకొని పార్వతమ్మ వెంట లోపలికి నడిచింది.

పార్వతమ్మ ఇచ్చిన చీర కట్టుకొన్న తరవాత సుజాత ఆమెతో కలిసి వంట ఇంటి ముందు గదిలోకి వెళ్లింది. అక్కడ పార్వతమ్మ కుంపటి రాజేసి, కాఫీ పెట్టడానికి ఉపక్రమించింది.

"మీ కెందుకండీ ఈ శ్రమ? వీడిని కాసేపు పట్టుకోండి. నే చేస్తాను కాఫీ" అంటూ చొరవగా పిల్లవాడిని తనకు అందించి, కుంపటి దగ్గరకు చేరిన సుజాత వేపు చూస్తూండిపోయిన పార్వతమ్మకు ఆమెకు తెలియకుండానే కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఏదో తెలియని ఆత్మీయతతో ఆ పిల్లవాడిని అక్కున అదుముకొంది పార్వతమ్మ. పార్వతమ్మ వేపు వింతగా చూస్తూ, ఆమె చెంపలపై కారుతున్న కన్నీళ్లను తన చిన్న అరచేతితో రుద్దుతున్నాడు ఆ పసిపిల్లవాడు. ఆ పిల్లవాడి చేష్టలకు పార్వతమ్మకు దుఃఖం ఆగలేదు.



ప్రథమ బహుమతి
చిత్రం—టి. ఎల్ల (వరంగల్)

వంచదార కోసం పక్కకు తిరిగిన సుజాత పార్వతమ్మ కళ్లనుంచి జలపాతాల్లా కన్నీళ్లు దూకుతూండడం చూసి నివ్వెరపోయింది.

"ఏమిటండీ! ? ఎందుకు బాధపడుతున్నారు?" అంటూపూర్తిగా పార్వతమ్మ వేపు తిరిగి అంది సుజాత.

పార్వతమ్మ ఏమీ మాట్లాడక పోవడం చూసి, మళ్లీ మళ్లీ అడిగింది సుజాత.


"చూడండి—ముక్కూ మొహం తెలీని నన్ను లోపలికి రమ్మని, చీర మార్చుకోమని బలవంతం చేసి నా మీద ఎంతో అనురాగం చూపారు. మీరు ఎందుకు బాధ పడుతున్నారో నేను తెలుసుకోకూడదా?"

సుజాత మాటలకు పార్వతమ్మకు దుఃఖం ముంచుకువచ్చింది. కొద్ది క్షణాలయిన తరవాత పార్వతమ్మ పమిట చెంగుతో కళ్లు తుడుచుకొని, పిల్లవాడిని మరింత దగ్గరగా తీసుకుంటూ—"చెపుతాను, సుజాతా! అంతా చెపుతాను. ఇంతకాలం ఎవరితోనూ ఈ బాధ చెప్పుకోలేక, నాలో నేనే భరిస్తూ వచ్చాను. ఇక దీనిని నేను భరించలేను. నీకు చెప్పుకొని నా ఆవేదన అంతా తీర్చుకొంటాను" అంది.

పార్వతమ్మ మరోసారి చెంగుతో కళ్లు తుడుచుకొని, కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయింది.

"నీ వన్నట్లు నీ వెవరో నాకు తెలియదు. అయినా ఈ కాస్సేపటిలోనే నా మనస్సంతా ఆక్రమించుకొని పోయావు. . . ఇదిగో— ఇటువంటి మనమలతో, మనమరాళ్ళతో కాలం గడప వలసిన వయస్సులో, మే మిద్దరం ఏ ఆనందం లేక మూష్టిచెట్లలా బతుకుతున్నాము. అందరి ఇళ్లలో పండగలకు, పబ్బాలకు కన్నబిడ్డలు, కోడళ్లు, అల్లుళ్లు, మనవలు రావడం చూస్తూంటే, నాకు రంపపుకోతగా ఉంటుంది. . ." చివరి మాట అనేటప్పుడు పార్వతమ్మ గొంతు దుఃఖంతో పూడుకొనిపోయింది మళ్లీ ఆమె కళ్లు నిండుచెరువులే అయినాయి. కొద్ది క్షణాలపాటు ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది. కొంచెం సేపయిన తరవాత ఆమె మళ్లీ ప్రారంభించింది.

"మాకు ఇద్దరు కొడుకులు. ఒకడేమో పై చదువులంటూ అమెరికా వెళ్లి, అక్కడే పెళ్లి చేసుకొని స్థిరపడిపోయాడు. అంతటితో వాడి ఆశ మాకు వదిలిపోయింది. ఇకపోతే రెండోవాడు. వీడు చిన్నప్పటినుంచి బాగా శ్రద్ధగా చదువుకుంటూ పైకి వచ్చాడు. అయితే తీరా పెళ్లి విషయం వచ్చేసరికి వాడు మమ్మల్ని కాదని, తనకు నచ్చిన పిల్లను చేసుకొన్నాడు. ఈ విషయంలో మాటా మాటా వచ్చి వాళ్ల నాన్నగారు వాడితో తెగతెంపులు చేసుకొన్నారు. ఇద్దరు బిడ్డల పెళ్లిళ్లూ కళ్ల చూసే

భాగ్యం లేకపోయింది మాకు. పెద్దవాడు వస్తాడన్న ఆశ లేదు. చిన్నవాడిని చూసే యోగమూ లేదు. . . ఈ పిల్లాడిని, నిన్ను చూసేసరికి నా మనస్సెందుకో అదోలా అయిపోయింది. అందుకే నిన్ను లోపలకు రమ్మన్నాను. నా చీర ఇచ్చి కట్టుకోమన్నాను. నీ లోనే ఎవరో ఆత్మీయులను చూడడానికి ప్రయత్నించాను. నేను పిచ్చిదాన్ని, సుజాతా, నేను పిచ్చిదాన్ని." పార్వతమ్మ కళ్ళు మళ్ళీ జలపాతాలే అయినాయి.

"ఊరుకోండి. అలా బాధ పడకూడదు. తప్పు కాదూ? ఆయన మాత్రం కొడుకులు దూరమైనారని బాధ పడటం లేదూ?" సుజాత అనునయిస్తూ అంది.

"ఆఁ ఆఁ. ఆయనా ఈమధ్య మారారు. కాని, ఏం ప్రయోజనం చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకొని? మా చిన్నవాడు ఎక్కడుంటు న్నాడో, ఏం చేస్తున్నాడోకూడా మాకు తెలీదు." పార్వతమ్మ గొంతు దుఃఖభారం వల్ల బొంగురుగా వినిపించింది.

సుజాత నిట్టూర్చింది. కుంపటి వేపు తిరిగి డికాక్షన్‌గిన్నె దించి, పాలు, పంచదార కలిపి కప్పుల్లో పోసింది.

"కాఫీ ఆయనకు ఇచ్చి వస్తారా?" అంటూ పార్వతమ్మ ఒడిలో కూర్చున్న పిల్లవాడిని తీసుకొంది.

అరగంట గడిచిన తరవాత వర్షం వెలిసింది.

"మరి నే వస్తానండి. మీ చీర రేపు ఉతికి పంపిస్తాను." పిల్లవాడిని ఎత్తుకొని గడప దాటుతూ అంది సుజాత.

"రిక్షా పిలుచుకొస్తా ఉండమ్మా" అంటూ పరంధామయ్య భుజం మీద శాలువా సరిచేసుకొని, సోఫా దగ్గరగా ఉన్న చేతికర్రను అందుకోబోయారు.

"అబ్బే— మీ కెందుకండి శ్రమ? నాలుగడుగులు వేసి, ఈ వీధి మలుపు తిరిగితే మెయిన్ రోడ్డుమీద రిక్షాలు తిరుగుతుంటాయిలెండి. వస్తానండి. నమస్తే!" అంటూ ముందుకు అడుగు వేసింది సుజాత.

చంకలో పిల్లాడితో మెల్లిగా నడిచి వెళుతున్న సుజాత వేపు చూస్తూండి పోయారు దంపతులిద్దరూ.

• • •

మరునాటి రోజు సాయంత్రం ఇంటిముందు ఒక కారు వచ్చి ఆగడంతో ఆశ్చర్యపోయారు పరంధామయ్య, పార్వతమ్మ. ఆ కారులో నుంచి సుజాత పిల్లవాడిని తీసుకొని దిగడం చూసి, వారిద్దరు నివ్వెరపోయారు.

సుజాత లోపలికి వస్తూనే, "నమస్కారమండి. నిన్న మీరు చేసిన మేలు మరువలేను. మీరు ఇద్దరు ఈ పూట మా ఇంటికి రావాలి" అంది.

"మీ ఇంటికా! ఇప్పుడా? మరోసారి ఎప్పుడేనా వస్తాంలే, అమ్మా." ఆశ్చర్యం నుంచి తేరుకొంటూ అన్నాడు పరంధామయ్య.

"కాదండి. మీరు ఇప్పుడే తప్పకుండా రావాలి" అంటూ పార్వతమ్మ వేపు నడిచి, "రాకపోతే నా మీద ఒట్టు" అంది గారంగా.

పది నిమిషాలలో కారు కదిలింది అందరితోనూ. ఊరి చివరగా ఉన్న పెద్ద పెద్ద బంగళాలలో ఒక దాని ముందుకు కారు వెళ్ళగానే, గేటు దగ్గరి గూర్ఖా గేటు బార్లగా తీసి సెల్యూట్ చేసి నిలబడ్డాడు. కారు పోర్టికోలోకి వెళ్లి ఆగింది. ఒక నౌకరు గబగబ వచ్చి కారు డోరు తీసి నిలబడ్డాడు.

"ఇదే మా ఇల్లు— రండి." సుజాత నవ్వుతూ ఆహ్వానించింది. పార్వతమ్మ, పరంధామయ్య ఇంకా ఆశ్చర్యంనుంచి తేరుకోనే లేదు. నౌకరు చేతికి పిల్లవాడిని అందించి, ఆప్యాయంగా పార్వతమ్మ చేతిని పట్టుకొని సుజాత ముందుకు నడిచింది.

గుమ్మానికి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుని పేపరు చదువుకుంటున్న ఒక వ్యక్తిని చూపిస్తూ, "ఆయనే మా శ్రీవారు" అంది సుజాత.

సుజాత మాటలకు తలఎత్తి చూసిన అతను కొయ్యబారిపోయాడు.

నిశ్చేష్టుడై తమ వేపే చూస్తూండి పోయిన అతనిని చూసి పార్వతమ్మ, ఆమె వెనకాలే నిలుచున్న పరంధామయ్య షాక్ తిన్నట్టయినారు. రెప్పపాటులోనే తేరుకొని పార్వతమ్మ— "నాయనా! బాబూ! శ్రీధర్!" అంటూ ఒక్క పరుగులో అతని దగ్గరకు చేరుకొంది.

"నా మూలంగా మీరు వేరై పోయారు. అది నేను సహించలేక పోయాను. పెళ్లి అయినప్పటి నుంచి మిమ్మల్ని చూడాలని ఆరాటపడేదాన్ని. అయితే, 'మా నాన్న చాలా పట్టుదలగల మనిషి, సుజా! లాభం లేదు' అని ఆయన అనేసరికి నేను నిస్పృహ చెందేదాన్ని .. అదృష్టవశాత్తు ఇక్కడికి బదిలీ అయింది. ఏది ఏమైనా సరే మిమ్మల్ని అందరిని కలపాలనుకొన్నాను. కన్న కొడుకును, చిన్నారి మనమడిని చూస్తే మీ పట్టుదలలు సడలిపోతాయని భావించాను. కారులో అర్భాటంగా వస్తే వీలుపడదని, కాలినడకనే వచ్చాము. నా అదృష్టం బాగుండి వర్షం పట్టింది. తడిసి ముద్దైన స్థితిలో మిమ్మల్ని కలుసుకొన్నాను. మీరు అనుభవిస్తున్న బాధ, ఆ కారణంగా మీరు నాపై చూపిన వాత్సల్యం నేను గ్రహించాను. మీ అబ్బాయిగారికికూడా ఈ విషయాన్ని చెప్పకుండా, ఈ రోజు మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చాను. . ." ఆ హాలులో సుజాత మాటలు ఎవరికీ వినిపించడం లేదు. ★



తల్లి ఒడిలో...

చిత్రం—వై. బాలయ్య (సిద్దిపేట)